క్లుప్తంగా

స్పందన సమావేశంలో అయిదు అర్జీలు



తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన సమావేశంలో అయిదు అర్జీలు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన ప్రజల్నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి ఒకటి, పంచాయతీ విభాగానికి రెండు, విద్యారంగం, వ్యయసాయ రంగానికి సంబంధించి ఒక్కోటి చొప్పున అర్జీలు వచ్చాయి. ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు పంపి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలియజేశారు. అదేవిధంగా మండల తహశీల్దార్ కార్యాలయంలో స్పందన సమావేశానికి నాలుగు అర్జీలు వచ్చాయి. ఇన్‌చార్జి తహసీల్దార్ హెనాప్రియ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

తెనాలిలో హ్యుండయ్ ఎక్స్‌టర్ కారు లాంచింగ్



తెనాలిఅర్బన్: సుల్తానాబాద్‌లోని కుసులవ హ్యుండయ్ షోరూమ్‌లో హ్యుండయ్ ఎక్స్‌టర్ కారును సోమవారం మేనేజర్ రామకృష్ణ లాంచ్ చేశారు. కార్యక్రమంలో పలు బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది నోవాహు, వేణు, రవి, చైతన్య, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయం అభివృద్ధికి కృషి



అత్తోట(కొల్లిపర): దేవాలయం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు అన్నారు. సోమవారం మండలంలోని అత్తోట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆయన స్వామి వారిని దర్శించుకుని విగ్నేశ్వరపూజ, నవగ్రహ పూజ, కాలభైరవునిపూజ, పరమేశ్వరని అభిషేకం, అమ్మవారికి అష్టోత్తర కుంకుమ పూజ వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని భక్తులు, అర్చకులు, గ్రామ పెద్దలు సమష్టిగా ఉంటూ దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ దేవాలయాలకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. తొలుత ఆలయ చైర్మన్ దండా సాంబశివరావు, మెంబర్ చందు సాంబశివరావు, ఎంపీటీసీ బొల్లి ముంతు పోతురాజు, సర్పంచ్ నాగపుణేశ్వరరావు, ఈఓ తమ్మా శివారెడ్డి ఆలయ అర్చకులు కొల్లిపర కోటేశ్వరరావు, బాస్కరరావు కలసి అంబటి తిరుపతి రాయుడు ను మర్యాపూర్వకంగా స్వాగతం పలుకుతూ శేష వస్త్రముతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొల్లి ముంత శంకర రావు, తుళ్లిమిల్లి రత్న మాణిక్యం, బేతపూడి మార్తమ్మ, దండా చిన్న , యర్రు సూర్యనారాయణ, కటికి గోపిచంద్, యర్రు వెంకటేశ్వరరావు, బల్ల శివనవీన్ తదితరలు పాల్గొన్నారు.

క్రిష్టియన్ రైట్స్ నాయకుల నిరసన



తెనాలిటౌన్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులు, గిరిజనులపై హిందూ ముసుగులో కొందరూ మతోన్మాదులు చేస్తున్న దాడులపై నిరసన వ్యక్తం చేస్తున్నట్లు క్రిష్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రిపూడి జాన్‌బాబు పేర్కొన్నారు. తెనాలి మండలం కఠెవరంలోని బ్యూలా మినిస్ట్రీస్ చర్చిలో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలువురు పాస్టర్లు పాల్గొని మణిపూర్‌లో క్రైస్తవ బాధితులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్రిష్టియన్ రైట్స్ అధ్యక్షుడు జానబాబు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, కుకి, నాగ గిరిజన తెగలపై దాడులు చేయడం దారుణమన్నారు. వందలాది చర్చిలను కూల్చివేశారని క్రైస్తవులు, గిరిజనులు శిబిరాల్లో తలదాచుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మణిపూర్ విషయంలో పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని, ప్రధానమంత్రి వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టరు బాబురావు, పాస్టరు ఆనందన్న, పాస్టర్ అబ్రహం, పాస్టరు చిట్టిబాబు, పాస్టరు దానియేలు, పాస్టరు ఇమ్మానియేలు, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

ఎన్నోఏళ్ల నాటి రైతుల కల సాకారం

- అసైన్డ్ రైతులు ఇకపై భూమి యజమానులు
- రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయంపై అసైన్డ్ రైతుల హర్షం
- తెనాలి నియోజకవర్గంలో 600 మందికిపైగా సాగుదార్లకు లబ్ధి



అన్నవరపులంకలో అసైన్డ్ భూములు

తెనాలి: అసైన్డ్ రైతులు ఇకపై భూమి యజమానులు...పట్టా భూముల రైతుల్లానే అవసరాలకు అమ్ముకోవచ్చు...బ్యాంకు రుణాలనూ తీసుకోవచ్చు. రాష్ట్ర ముఖ్యమంత్రి
వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం తీసుకున్న నిర్ణయం ఫలితమిది. గత ఏడు దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం తీసుకోలేని విధంగా సాహసోపేతమైన చర్యకు పూనుకున్న వైఎస్సార్ సీపీకి అసైన్డ్ రైతులు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

నిరుపేదలకు సాగుభూమి....

రాష్ట్రంలోని నిరుపేదలకు సాగుభూమిని కేటాయింపుతోపాటు అసైన్డ్ భూములపై సాగుదారులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కేటాయించిన 20 సంవత్సరాల తర్వాత అసైన్డ్ భూముల యజమానులకు సర్వహక్కులు ఇవ్వడం అనేది రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి. లక్షలాది సాగుదారుల బతుకు చిత్రాన్నే మార్చివేయటమే కాకుండా, అసైన్డ్ భూములపై తరచూ తలెత్తే వివాదాలకు తెర పడనుంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో తెనాలి నియోజకవర్గంలోని 600 పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సాగుదార్లకు యాజమాన్య హక్కులు దక్కనున్నాయి.

1954 తర్వాత ప్రభుత్వం....

భూమి లేని నిరుపేదలకు 1954 తర్వాత ప్రభుత్వం కేటాయించిన భూములపై వారికి ఎలాంటి హక్కులు లేని విషయం తెలిసిందే. అసైన్డ్ చట్టాల్లో ఈ భూములను అమ్మకూడదనే నిబంధన ఉండడంతో వాటన్నిని షేధిత జాబితా 22 (ఏ)లో చేర్చారు. అంతేకాకుండా 1977లో వచ్చిన ఏపీ అగ్రికల్చరల్ ల్యాండ్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్-పీఓటీ) చట్టం వచ్చింది. దీని ప్రకారం నిరుపేదలకు వ్యవసాయం కోసం ఇచ్చిన భూములను అమ్ముకోకూడదు. ఏ కష్టం వచ్చినా, చదువుల కోసమైనా, ఆరోగ్యం కోసమైనా అమ్ముకునే అవకాశం లేదు. అసైన్డ్ భూములను సాగుచేసుకునే రైతులు, క్రయవిక్రయాలకు వీల్లేకపోయింది. అయినా తప్పని పరిస్థితుల్లో కొందరు సాగుదారులు తమకున్న భూమిలో ఎంతోకొంతను విక్రయించుకోక తప్పడం లేదు. రిజిస్ట్రేషన్‌కు వీలు లేనందున కాగితాల పైనే రాసుకుని అమ్మేవారు. ఆ భూమి గురించి ప్రభుత్వం ఎప్పుడైనా నోటీసులు జారీచేయొచ్చు. ఇతర ప్రభుత్వ అవసరాలకు తీసుకోవచ్చనే భయం ఉండేది. దీంతో భూమి అమ్ముకున్న సాగుదారుకు మార్కెట్ ధరలో కనీసం పాతిక శాతం కూడా లభించేది కాదు. అసైన్డ్ రైతులు ఎంతోకాలంగా చేస్తున్న విజ్ఞప్తులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టించుకుంది. రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో 13 మంది ఎమ్మెల్యేలతో గతేడాది ఆగస్టులో ప్రజా ప్రతినిధుల కమిటీని ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి వచ్చిన కమిటీ నివేదిక ప్రకారం, భూమిని కేటాయించిన 20 ఏళ్ల తర్వాత లబ్ధిదారులు, వారు లేకపోతే వార సులకు ఆ భూమిపై యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఏపీ అసైన్‌మెంట్-1977 చట్టానికి సవరణ చేయనున్నారు.

తెనాలి నియోజకవర్గంలో...

తెనాలి నియోజకవర్గంలో అసైన్డ్ సాగుదార్లయిన దళిత, బడుగు, బలహీనవర్గాలవారు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. నియోజకవర్గంలో 600 పైగా అసైన్డ్ రైతులున్నారు. వీరంతా 350 ఎకరాలకు పైగా భూమిని సాగుచేస్తున్నారు. కొల్లిపర మండలంలోని అన్నవరంలో 65.32 ఎకరాల భూమిని 102 మంది, బొమ్మువానిపాలెంలో 182.56 ఎకరాలను 228 మంది అనుభవిస్తున్నారు. తెనాలి రూరల్ మండలంలో వందకు పైగా ఎకరాలను 200 మంది రైతులకు అసైన్డ్ చేసివున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరంతా ప్రయోజనం పొందనున్నారు.



అసైన్డ్ భూమి మంజూరు పత్రం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం...



మాకు 40 సెంట్ల సాగు భూమి ఉంది. ఎప్పుడో మా తాతకు ప్రభుత్వం ఇచ్చింది. మా తాత, తర్వాత మా నాన్న పండించుకున్నారు. ఇప్పుడా భూమిలో నేను వ్యవసాయం చేస్తున్నారు. తన పూర్వీకుల నుంచి సంక్రమించిన అసైన్డ్ భూమికి ప్రభుత్వ పట్టాలు ఇప్పించాలని ఎంతోకాలంగా ప్రాధేయపడుతూనే ఉన్నాం. ఇన్నేళ్లకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో మాకు పట్టాలు వస్తాయన్న నమ్మకం కలిగింది. ఆయనకు రుణపడివుంటాం.

– తోదేటి సుబ్బారావు, అన్నవరపులంక

చట్టసవరణ చేసి మరీ ఇస్తారంట...



మాకు 50 సెంట్ల భూమి ఉంది. అదంతా మా పూర్వీకుల నుంచి వచ్చిందే. దశాబ్దాలుగా సాగుచేస్తున్నా ఆ భూములపై మాకు ఎలాంటి హక్కు లేదు. జీవనం గడచిపోతోంది. మాకు పట్టాలు ఇప్పించమని అధికారులను ఎన్నో ఏళ్లుగా అభ్యర్థిస్తున్నాం. ఎలాంటి ప్రయోజనం లేదు. ఇక ఆశలు వదిలేసుకున్న దశలో ముఖ్యమంత్రి జగన్, చట్టసవరణ చేసి మరీ మాకు పట్టాలు ఇచ్చేందుకు నిర్ణయించారని తెలిసింది. చాలా సంతోషంగా ఉంది.

– తోదేటి విజయ్‌బాబు, అన్నవరపు లంక

మా గ్రామంలోనే 102 మందికి లబ్ధి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గొప్పది. ఎంతోకాలంగా అసైన్డ్ భూములను సాగుచేస్తున్న రైతులకు ప్రయోజనం కలుగుతుంది. కేవలం మా అన్నవరపులంక గ్రామంలోనే 102 మంది అసైన్డ్ రైతులకు యాజమాన్య హక్కులు లభిస్తాయి. నిజంగా రాష్ట్ర ప్రభుత్వం చాలా మంచి నిర్ణయం తీసుకుంది.

– తోదేటి దాసు, గ్రామపెద్ద, అన్నవరపు లంక

తల్లిదండ్రులను విస్మరించరాదు

న్యాయమూర్తి శ్రీసీత



విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీసీత

తెనాలిరూరల్: నేటి యువత ఆధునిక పోకడలకు పోతూ కన్నవారు, సమాజం పట్ల తమకున్న బాధ్యతను విస్మరించి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సరికాదని 2వ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత అన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్,11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. మాలతి ఆదేశాల మేరకు సోమవారం తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలోని ఆంధ్ర ప్రదేశ్ బీసీ వెల్ఫేర్ కళాశాల బాలికల వసతి గృహాన్ని న్యాయమూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందుతున్న సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, వారి భోజన శాల, వాషింగ్ ఏరియాలను, వంటశాలను తనిఖీ చేశారు. వసతి గృహంలో బస చేస్తున్న విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని న్యాయమూర్తి స్వయంగా తిని పరిశీలించారు. అనంతరం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చెడు స్నేహాల పట్ల ఆకర్షితులు కాకుండా విద్యపై దృష్టి సారించి నిర్దేశించుకున్న లక్ష్య సాధనకై నిరంతరం శ్రమించాలన్నారు. సమాజంపై సరైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సామాజిక మాధ్యమాల వినియోగంపై అప్రమత్తతతో వ్యవహరించాలని, అవసరం మేరకు మాత్రమే వాటిని ఉపయోగించాలని సూచించారు. అదే విధంగా చట్టాలపై అవగాహన కూడా కలిగి సరైన మార్గంలో పయనించి వారి వారి లక్ష్యాయలను చేరుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఎవరికి చెప్పుకోలేని స్థితిలో ఉన్నప్పుడు మండల న్యాయ సేవాధికార సంస్థ వెన్నుదన్నుగా ఉంటుందని. మీ సమస్యను అర్జీ రూపంలో అందిస్తే వీలైనంత త్వరితగతిన సత్వర పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. తలిదండ్రులకు, విద్య నేర్పిన గురువులతో పాటుగా దేశానికి కూడా పేరు ప్రఖ్యాతులను తెచ్చే విధంగా నడుచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సరోజిని, తెనాలి రూరల్ ఎస్‌ఐ ప్రసన్నకుమార్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ఎస్వీ యోగ కన్వీనర్ రమణయ్య, అప్పారావు

తెనాలిటౌన్: పట్టణ గాంధీనగర్ నరేంద్రదేవ్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు సోమవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణయ్య యోగాసానాలు వేయించి ప్రాణయం, ధ్యానం చేయించి వాటి ఉపయోగాలు గురించి తెలియజేశారు. అనంతరం వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఈఎల్‌వి.అప్పారావు, రమణయ్యలు విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఎస్వీయోగ కేంద్రం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 340 శిబిరాలు నిర్వహించామని, వృద్ధులకు అన్నదానం, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

గంజాయి కేసులో ఏడుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐలు

తెనాలిరూరల్: తెనాలి పట్టణంలోని రైల్వేస్టేషన్ వెనుక వైపు ఉన్న రైల్వే పాత గూడ్స్ షెడ్డు వద్ద గంజాయి అమ్ముతున్న, కొనుగోలు చేస్తున్న ఏడుగురిని త్రీ టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 62 వేల రూపాయల విలువ చేసే 1240 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం త్రీ టౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ బి జనార్ధనరావు తెలియజేశారు. పాండురంగపేటకు చెందిన షేక్ నాగూర్‌బాబు చెడు వ్యసనాలకు బానిసై గంజాయి తీసుకువచ్చి తెనాలిలో విక్రయాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కటికల శ్రీను, మన్నూరి ఏడుకొండలు, షేక్ అబ్దుల్ రహమాన్, సింహాద్రి పూర్ణచంద్, షేక్ ఖాజా, షేక్ కరిముల్లాలు అతడికి పరిచయం కాగా వారికి గంజాయి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఆదివారం రాత్రి వీరంతా గూడ్స్ షెడ్డు వద్ద ఉన్నట్లు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం రావడంతో సీఐ ఎస్. రమేష్ బాబు, ఎస్‌ఐలు ఎం. విజయ్ కుమార్, అహ్మద్ భాష, సిబ్బంది అంకయ్య, రంజిత్ అక్కడకు చేరుకుని ఆకస్మిక సోదాలు చేశారు. గంజాయి అమ్ముతున్న షేక్ నాగూర్‌బాబుతో పాటు కొనుగోలు చేసి సేవిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 62 వేలు విలువచేసే 1240 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ రమేష్ బాబు సహా ఎస్‌ఐలు యం విజయ్ కుమార్, అహ్మద్ బాషా, సిబ్బంది మార్పు అంకయ్య, కె. రంజిత్ కుమార్, కె. చిరంజీవి, మురళీలను డీఎస్పీ అభినందించారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు

పెద్ద అత్తపై అల్లుడు దాడి

తెనాలిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో పెద్ద అత్తపై అల్లుడు దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణ ఇస్లాంపేటకు చెందిన ప్రభతో ఆమె చెల్లెలి అల్లుడు గోపి సోమవారం ఘర్షణ పడి దాడి చేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళ్తున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. తెనాలి మండలం సోమసుందరపాలెం ఆటోనగర్ వద్ద అధిక ఇసుక లోడుతో వెళ్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం. సిబ్బంది సోమవారం గుర్తించారు. లారీ యజమానికి రూ. 14 వేల జరిమానా విధించారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నమెంటు

వివిధ కేటగిరీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం





17 ఏళ్లలోపు బాలికల, బాలుర డబుల్స్ విజేతలకు బహుమతిని ప్రదానం చేస్తున్న మునగాల మోహన్‌శ్యాంప్రసాద్

తెనాలి: స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ, తెనాలి ఆధ్వర్యంలో డబుల్‌హార్స్ మినపగుళ్లు సౌజన్యంతో స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ ఇండోర్ స్టేడియంలో రెండురోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు ఆదివారం సాయంత్రం ముగిసింది. ఆంధ్రాప్యారిస్ కప్ పేరుతో నాలుగు కేటగిరీల్లో ఈ పోటీలు పోటాపోటీగా సాగాయి. ముగింపు సభలో డబుల్ హార్స్ మినపగుళ్లు అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ జి.సాయి రేవతి, ఏలూరు స్పోర్ట్స్ అధికారి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ సాంబశివ రావు, స్థానిక ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సునీల్, హ్యాండ్‌బాల్ అకాడమీ కోచ్ కె.నాగరాజు ముగింపు సభలో పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో విజేతల వివరాలిలా ఉన్నాయి.

11 ఏళ్లలోపు కేటగిరి: బాలికల సింగిల్స్‌లో బి.దివ్య, వర్షితలు ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలిచారు. బాలికల డబుల్స్‌లో జె.సాహిత్య, బి.దివ్య (తెనాలి) జంట ప్రథమ, కె.లాస్య, కె.తేజస్వి (తెనాలి) జోడీ ద్వితీయ బహుమతిని దక్కించుకున్నారు. బాలుర సింగిల్స్‌లో వి.నిషాంత్, ఎ.త్రిషాల్ రెడ్డి ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలిచారు. డబుల్స్‌లో ప్రథమ బహుమతిని దినేష్, నిషాంత్‌లు జోడీ గెలుచుకోగా, ద్వితీయ బహుమతిని త్రిషాల్ రెడ్డి, ప్రన్సు జంట దక్కించుకుంది.

13 ఏళ్లలోపు కేటగిరీ: బాలికల సింగిల్స్‌లోనూ బి.దివ్య ప్రథమ, వర్షిత ద్వితీయ బహుమతిని గెలిచారు. డబుల్స్‌లో బి.దివ్య, జె.సాహిత్య జోడీకి ప్రథమ, పూజాశ్రీ, టి.రోజీ జంటకు ద్వితీయ బహుమతి లభించాయి. బాలుర సింగిల్స్‌లో కె.చైతన్య ప్రథమ, షణ్ముఖ ఆదిత్య ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. డబుల్స్‌లో కె.చైతన్య, వి.నిషాంత్ జంట ప్రథమ, గీతేష్, షణ్ముఖ ఆదిత్య జోడీ ద్వితీయ బహుమతిని సాధించింది.

15 ఏళ్లలోపు కేటగిరీ: బాలికల సింగిల్స్‌లో రమ్య, లోకేశ్వరిలు ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలిచారు. డబుల్స్‌లో రమ్య, యశ్విత జంట ప్రథమ, పూజాశ్రీ, వర్షితల జోడీకి ద్వితీయ బహుమతులను గెలిచారు. బాలుర సింగిల్స్‌లో కె.చైతన్య ప్రథమ, అరవింద్ ద్వితీయ బహుమతిని గెలిచారు. డబుల్స్‌లో కడపకు చెందిన పవన్-సాకేత్ జంట ప్రథమ, తెనాలికి చెందిన విజ్ఞాన్, జయీద్ జోడీ రెండో బహుమతిని సాధించారు.

17 ఏళ్ల కేటగిరి: బాలికల సింగిల్స్‌లో లక్ష్మీ పల్లవికి ప్రథమ బహుమతి, లోకేశ్వరికి ద్వితీయ బహుమతి లభించాయి. డబుల్స్‌లో లక్ష్మీపల్లవి, లోకేశ్వరి జంట విజేతగా నిలిచింది తెనాలికి చెందిన ప్రణవిదాస్, తేజశ్రీ జోడీకి రెండోస్థానం దక్కింది. బాలుర సింగిల్స్‌లో కడపకు చెందిన జస్వంత్ ప్రథమ, పవన్ ద్వితీయ బహుమతులను కై వసం చేసుకున్నారు. డబుల్స్‌లో తెనాలికి చెందిన విజ్ఞాన్, జయీద్‌ల జోడీ విజేతగా నిలిచింది. రెండోస్థానాన్ని కడపకు చెందిన జస్వంత్, పవన్‌లు దక్కించుకున్నారు. అఫీషియల్స్‌గా వేళాంగిని రెడ్డి, వినయ్‌కుమార్, సైదావలి, భాషా, సాయి, యాసిన్, పిల్లి కాలేబు వ్యవహరించారు.

బ్లాక్‌లిస్టులో శ్రీవెంకటేశ్వర శ్రీసత్యదేవ డిగ్రీ కాలేజీ

జీఓ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

తెనాలి: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర శ్రీసత్యదేవ డిగ్రీ కాలేజీని ప్రభుత్వం 2023-24 నుంచి 2025-26 విద్యాసంవత్సరం వరకు బ్లాక్‌లిస్టులో ఉంచింది. దీనితోపాటు కొల్లిపరలో గల శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీని కూడా ఇదే జాబితాలో చేర్చింది. దీనితో మూడేళ్లపాటు ఆయా కాలేజీల్లో అడ్మిషన్లకు అవకాశం లేదు. అన్‌ఎయిడెడ్, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో ఫీజుల విధానం నిర్ణయం కోసం ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్, రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల నుంచి వివరాలను కోరింది. కమిషన్ కోరిన మేరకు డేటా సమర్పించని 30 కాలేజీలను మూడేళ్లపాటు బ్లాక్‌లిస్టులో ఉంచుతూ ప్రభుత్వం జీఓ జారీచేసింది. అందులో పై రెండు కాలేజీలూ ఉన్నాయి. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషనుకు ఎదురుగా ఉత్తరంవైపున గల ఓ ప్రైవేటు విద్యాసంస్థ ప్రాంగణంలో శ్రీవెంకటేశ్వర శ్రీసత్యదేవ డిగ్రీ కాలేజీ కొన్నేళ్లుగా నడిచింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ లోనూ 14361 కోడ్ నంబరు కలిగిన ఈ కాలేజీ అదే చిరునామాలో కొనసాగుతోంది. వాస్తవానికి ఆ కాలేజీ ఇప్పుడు ఇక్కడ లేదు. కొంతకాలం క్రితమే యాజమాన్యం ఖాళీ చేసింది. ఎన్నారై డిగ్రీ కాలేజీ (పూర్వ శ్రీవెంకటేశ్వర శ్రీసత్యదేవ డిగ్రీ కాలేజీ) పేరుతో గాంధీనగర్‌లోని ఓ వీధిలో నూతన భవనంలో ఏర్పాటుచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాల, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అనుబంధ సంస్థగా పేర్కొంటూ 2022-23 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ఆరంభించారు. పేరు మార్పుకు, క్యాంపస్ చిరునామా మార్చేందుకు యూనివర్శిటీ/ ఉన్నత విద్యామండలి నుంచి ఎలాంటి అనుమతుల్లేవు. కొత్త కోర్సుల విషయంలోనూ అనుమతులు తీసుకోలేదు. ఈ విషయం గతేడాది నవంబరులో ‘సాక్షి’లో ప్రచురితం కావడంతో కాలేజీ అక్కడ్నుంచి జెండా పీకేసింది. ఎక్కడా చిరునామా లేకుండానే ఆ కాలేజీకి అడ్మిషన్లు కూడా జరిగాయి. కౌన్సెలింగ్‌లో ఈ విషయం స్పష్టమైంది. ఎన్నారై డిగ్రీ కాలేజీగా అనధికారికంగా పేరు మార్చుకున్న శ్రీవెంకటేశ్వర శ్రీసత్యదేవ డిగ్రీ కాలేజీని ఇప్పుడు ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో చేర్చింది. మరి ఇప్పటికే ఇక్కడ అడ్మిషన్లు పొందిన విద్యార్థులను ఏం చేస్తారనేది ప్రశ్న!

రహదారిపై స్టాప్ బోర్డులు ఏర్పాటు

తెనాలిరూరల్: తెనాలి-చందోలు రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. రహదారిలో తెనాలి ఆర్టీసీ బస్టాండ్ నుంచి కబేళా వంతెన వరకు ఆరు కూడళ్లలో స్టాప్ బోర్డులను ట్రాఫిక్ ఎస్ఐ జె. శ్రీనివాస్ సోమవారం ఏర్పాటు చేయించారు. రహదారిలో వాహన ప్రమాదాలను నివారించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా స్టాప్ బోర్డులను ఏర్పాటు చేయించినట్టు తెలిపారు. వీటి కారణంగా పట్టణ పరిధిలో రహదారిపై వాహనాల వేగం నియంత్రి ఇంచే అవకాశం ఉంటుందని వివరించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

తెనాలిరూరల్: న్యాయవాదులపై దాడులు, బెదిరింపులకు పాల్పడడాన్ని నిరసిస్తూ తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాది సయ్యద్‌మాస్తన్‌ను చంపుతానని బెదిరించడం, మొవ్వ బార్ అసోసియేషన్ కార్యదర్శి జి. శ్రీనివాసరావుపై భౌతిక దాడులను న్యాయవాదులు తీవ్రంగా నిరసించారు. తెనాలి కొత్తపేటలోని కోర్టుల ప్రాంగణం ఎదుట నిరసన తెలిపారరు. అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, ఉపాధ్యక్షుడు కంచర్ల చంద్రశేఖర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నియోజకవర్గంలో సంక్షేమానికే
- రూ. 16 వందల కోట్లు ఖర్చు
- ఎమ్మెల్యే శివకుమార్



సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: తెనాలి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం 16 వందల కోట్ల రూపాయలు పేద ప్రజలకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. సోమవారం కొల్లిపర పంచాయతీ పరిధిలోనే గ్రామ సచివాలయం 1లో మూడవ రోజు స్థానిక బ్రహ్మం గుడి వద్ద నుంచి గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును ,గ్రామంలో అభివృద్ధి పై స్థానిక సచివాలయం సిబ్బంది, మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి ఇంట్లో ఉన్న వారికి చెబుతూ వైసీపీ ప్రభుత్వాన్ని మరల అధికారంలోకి తీసుకురావాలని కోరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగనన్న ఆశీసులతో తెనాలి నియోజకవర్గంలో ఇళ్ల లేని నిరుపేదలకు 26 వేల మందికి జగనన్న లేఅవుట్‌లతో ఇళ్ల స్థలం ఇవ్వడం జరిగిందన్నారు. దీనిలో భాగంగానే ఈరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 260 మందికి కేటాయించిన జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న జయమ్మ అనే వృద్ధ మహిళ పరుగుపరుగున తన వద్దకు వచ్చి అప్యాయంగా పలకరించింది. ఇప్పుడు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. గతంలో ఇళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతూ ఎక్కడెక్కడో ఉంటూ జీవనం సాగిస్తూ ఉండేదాన్ని ఇప్పుడు జగన్ ఇచ్చిన ఇళ్ల స్థలంలో ప్రభుత్వం ఇచ్చిన వాటితో కలిపి తాను కొంత ఖర్చు చేసి తాను సొంతంగా ఇళ్లు నిర్మించుకోవడం ఎంతో ఆనందరంగా ఉందని తన జీవితంలో సొంత ఇళ్లు కట్టుకోలేను అని అనేక సార్లు బాధపడినట్లు ఇప్పుడు తన మనవడుగా భావిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శివకుమార్ సహకారంతో ఇళ్లు నిర్మించుకుని ఎవరిపైన ఆదారపడకుండా జీవించడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె వ్యక్తం చేసింది. స్పందించిన ఎమ్మెల్యే రెండు రోజుల్లో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి(శివకోటి), పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, ఎంపీటీసీలు కె.శ్రీలత, చిలువూరి ఝాన్సీ, గ్రామ నాయకులు బొమ్ము మహేశ్వరరెడ్డి, కళ్ళం వీరారెడ్డి పాల్గొన్నారు.